క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


పళికల మురళి(ఫైల్)

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. పొట్నూరుకు చెందిన పళికల మురళి(23) భీమునిపట్నం మండలం చిప్పాడ దివీస్‌లో హౌస్ కీపర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే విధులు ముగించుకుని బైక్‌పై మంగళవారం రాత్రి పొట్నూరు వస్తుండగా.. కురపల్లి జగనన్న కాలనీ మలుపు వద్ద తాటి చెట్టును ఢీకొట్టాడు. దీంతో మురళి తలపై బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం విజయనగరం మహారాజు ఆస్పత్రికి 108లో తీసుకెళ్తుండగా.. మార్గం మధ్యలో మృతి చెందాడు. మురళీ భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఏడాది కుమారుడు, తల్లిదండ్రులు రమణమ్మ, రమణ, సోదరి ఉన్నారు.

నిర్ణీత ఫారంలో 'స్పందన' దరఖాస్తు

మధురవాడ: మధురవాడలోని జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయాలనుకునే వారు నిర్ణీత నమూనా ప్రకారమే దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుందని జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. ఈమేరకు జోనల్ కార్యాలయంలో నోటీసులు అతికించారు. ఇక్కడ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. సౌకర్యం కేంద్రం కౌంటర్ నంబర్–2లో స్పందన నమూనా దరఖాస్తు లభిస్తుందని, అది తీసుకుని సమస్యను పూర్తిగా రాయాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి దరఖాస్తుదారుడి పూర్తి అడ్రస్, ఫోన్ నంబర్, ఆధార్ కార్డు జత చేయాల్సి ఉంటుందని చెప్పారు. వివరాలకు సౌకర్యం కేంద్రం లేదా జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని జెడ్సీ కోరారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

మధురవాడ: కొమ్మాది జంక్షన్ సమీపంలో హైవే సర్వీస్ రోడ్డు నుంచి మధురవాడ రైతుబజార్‌కు వెళ్లే మలుపును అభివృద్ధి చేసి, ట్రాఫిక్ సమస్య తగ్గించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ కాలువపై ఉన్న శ్లాబుల ఎత్తు తగ్గించి, పక్కన కూడా శ్లాబులు వేయడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గుతాయని గతంలో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని, అధికారులు పరిశీలించి వదిలేశారని చెబుతున్నారు. మలుపు వద్ద 6 అడుగులు మేర కాలువపై శ్లాబులు ముందుకు వచ్చాయని, వాటి ఎత్తు తగ్గించి సరిచేస్తే వాహనాలు సులువుగా మలుపు తిరిగి ట్రాఫిక్ సమస్య కాస్త తగ్గడానికి అవకాశాలు ఉన్నాయని సూచించారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి


ధాన్యం కొనుగోలుపై సీఈవో కోటేశ్వరరావుతో చర్చిస్తున్న శాఖాధికారి అప్పలస్వామి

పద్మనాభం: రబీ పంటలు వేసే రైతులందరూ ఈ క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి అన్నారు. మండలంలోని కృష్ణాపురం, మద్ది, పొట్నూరు, బాందేవుపురం, గంధవరం రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈకేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో శాఖాధికారి ఎం.వి.ఎస్.చలం, పద్మనాభం పీఏసీఎస్ సీఈవో కె.కోటేశ్వరరావులతో ధాన్యం కొనుగోలు గురించి చర్చించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇంత వరకు ఎంత కొనుగోలు చేశారో వీరిని అడిగి తెలుసుకున్నారు.

సంక్రాంతి కోలాహలం

- పాఠశాలల్లో సంప్రదాయబద్ధంగా సంబరాలు
- విద్యార్థులు, ఉపాధ్యాయుల సందడి


గుడిలోవ పాఠశాలలో చిన్నారులు వేసిన భోగి మంటలు

తగరపువలస: నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. తగరపువలస, చిట్టివలస, సంగివలసలోని స్కూళ్లల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పండగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పాఠశాల ఆవరణలను రంగవల్లులతో తీర్చిదిద్ది గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా గొబ్బెమ్మలు, పాలపొంగుళ్లు, చెరకు గడల పందిళ్లతో అలంకరించారు. భోగి మంటలు, హరిదాసులు, గంగిరెద్దులు, బుడబుక్కల వేషాలు, బొమ్మల కొలువులు, సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సంక్రాంతి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కొత్త పంటలు ఇంటికి చేరే వేళ కొత్త దుస్తులు, పిండి వంటలు, చిన్నాపెద్దలు కలిసి బంధువులతో వేడుకగా జరుపుకునే పండగ గొప్పతనం గురించి తెలియజేశారు. కోడిపందాలు, పశువుల అలంకరణ పూజ, పెద్దలకు దుస్తులు, పొత్తర్లు, పెట్టుట గురించి వివరించారు.

విద్యార్థుల కేరింతలు

ఆనందపురం: మండలంలోని తర్లువాడలో గుడిలోవ సరస్వతి విద్యా విహార్ ఆధ్వర్యంలో విద్యార్థులచే నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కనులు పండువగా సాగాయి. సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు కళ్లకు కట్టినట్టు చూపించి నేటి తరానికి గుర్తుచేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నారులను ఆశీర్వదిస్తూ వారి శిరస్సుపై భోగి పళ్లు వేయడం, డూడూ బసవన్నల వేషధారణలు, పులి వేషాలు, గంగిరెద్దులు ఆట, గోదా కల్యాణం వంటి అంశాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి స్థానిక సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, విజ్ఞాన్ విహార్ కమిటీ సభ్యుడు మజ్జి వెంకటరావులు మాట్లాడుతూ దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిన్నతనం నుంచే భారతీయ సంప్రదాయాలను పిల్లలకు నేర్పిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.వి.శ్రీనివాసరావు, మజ్జి నాగరాజు, బాలి రవి తదితరులు పాల్గొన్నారు.

వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని సన్ స్కూల్‌లో స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. చిన్నారులు పులివేషాలు, కర్రసాములు, సంప్రదాయ వేషాలు, భోగిమంటలు, పలు వేషధారణల్లో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


భీమిలిలో రైతుల కుటుంబ వేషధారణల్లో చిన్నారులు

ఆడిపాడి.. అలరించి..

కొమ్మాది: సంక్రాంతి పండగ విశిష్టతను తెలుపుతూ విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్, 4వ వార్డు కె.నగరపాలెంలోని శ్రీ సంపత్ పాఠశాలలోనూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటపాటలతో సందడి చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండగల విశిష్టతను విద్యార్థులకు వివరించారు.


చిట్టివలస శ్రీరామకృష్ణ స్కూల్‌లో భోగి మంట వద్ద విద్యార్థుల సందడి

పద్మనాభం మండలంలో..

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి, నరసాపురం, నేరేళ్లవలస ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు భోగి మంటలు వేశారు. సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. విద్యార్థినులు పాఠశాలల ఆవరణలో ముగ్గులు వేశారు. డూడూ బసవన్నల బొమ్మలు అందరినీ ఆకట్టుకున్నాయి.

బిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో..

పీఎం పాలెం: బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కాలేజీలో సక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. కళాశాల ప్రాంగణాన్ని విద్యార్థినులు అందమైన రంగవళ్లులతో తీర్చిదిద్దారు. గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా పాడి పంటలు, హరిదాసు వేషధారణ, గంగిరెద్దులు.. ఉత్సాహంగా భోగిమంటలు వేసారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీలక్ష్మి, అకాడమిక్ డైరెక్టర్ గోపీనాథ్, ప్రిన్సిపాల్ గోవిందరాజు, ఇతర విభాగాల అధిపతులు పాల్గొన్నారు.


రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థుల వేడుకలు


రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో భోగి మంట వేస్తున్న విద్యార్థులు


బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విద్యార్థులకు పుస్తకాలు, పలకల పంపిణీ

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెం పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థలు బుధవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశాయి. గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను అందించాయి. ఈ సందర్భంగా సర్పంచ్ భావిశెట్టి భారతమ్మ, ఉప సర్పంచ్ మరుపిళ్ల నిర్మలమ్మ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు పేద విద్యార్థులకు సాయం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిని చైతన్య పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉప్పాడ అప్పారావు, పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్, హెచ్ఎం రోజారాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యా సామగ్రి అందుకున్న పిల్లలతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

వాలీబాల్ టోర్నీ విజేతలకు బహుమతులు

పద్మనాభం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రేవిడిలో అనంత ఫ్యాషన్ దుస్తుల షాపు యజమాని ఆర్థిక సహకారంతో రెండు రోజుల పాటు భీమిలి నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల విజేతలకు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మరగడ అప్పారావు నగదు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పద్మనాభం జట్టుకు రూ.6 వేలు, ద్వితీయ స్థానం కృష్ణాపురం జట్టుకు రూ.3 వేలు, తృతీయ స్థానం మజ్జిపేట జట్టుకు రూ.2 వేల చొప్పున నగదు బహుమతి, షీల్డ్‌లు అందజేశారు.


విజేతలకు నగదు బహుమతి, షీల్డ్‌లను అందజేస్తున్న మరగడ అప్పారావు

రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తే రూ.500 జరిమానా

తగరపువలస: భీమిలి జోన్‌లోని ఖాళీ స్థలాలు, రోడ్లపై చెత్త వేస్తే రూ.500 జరిమానా విధించాలని సచివాలయ అధికారులను జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. ఒకటో వార్డు బంగ్లామెట్టపై బుధవారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుళాయిల ద్వారా తాగునీరు రోజు విడిచి రోజు తక్కువగా వస్తోందని స్థానిక మహిళలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై జెడ్సీ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రోడ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా ప్రజలు సచివాలయ, శానిటేషన్ అధికారులకు సహకరించాలని కోరారు. పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపాడ వెంకటరమణ, కుమిలి సూర్యనారాయణ, తమ్మిన అశోక్, సచివాలయ అడ్మిన్ జగదీష్, సిబ్బంది సతీష్, శివ, ధనలక్ష్మి, మోహన్, సురేష్, కడగల శ్రీను, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


బంగ్లామెట్టపై స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ రాము

ఊపందుకున్న సంక్రాంతి షాపింగ్

వినియోగదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు


మార్కెట్‌లో విక్రయానికి మట్టిపాత్రలు


రోడ్డు పక్కన దుస్తులు, అల్యూమినియం పాత్రలు విక్రయిస్తున్న వ్యాపారులు

తగరపువలస: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రత్యేక చిరు వ్యాపారాలు ఊపందుకున్నాయి. తగరపువలస కేంద్రంగా ప్రయివేట్ మార్కెట్‌లో నిత్యం జరిగే క్రయవిక్రయాలు కాకుండా పండగ సందర్భంగా వినియోగించే మట్టి, అల్యూమినియం పాత్రలు, వెదురుతో చేసిన బుట్టలు, అన్నం వార్చే జిబ్బులు, చనిపోయిన వారికి పెట్టే పంచెలు, చీరెలు విక్రయించే చిరువ్యాపారుల సంఖ్య పెరిగింది. పేదలు కొనుగోలు చేసేందుకు రోడ్ల పక్కన విక్రయించే రెడీమేడ్ వస్త్రాల దుకాణాలు వెలిశాయి. వీటి వద్దకు వినియోగదారులు చేరుకుని బేరసారాలు సాగిస్తున్నారు. వస్త్ర దుకాణాలు కూడా ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. పండగలో ప్రధాన పాత్ర వహించే కూరగాయలు, పూజా సామగ్రి, పువ్వులు, చెరకు విక్రయాలు పెరిగాయి. కిరాణా దుకాణాలు, సంప్రదాయ పిండివంటలు విక్రయించే స్వీట్స్ షాపులు, ఫ్యాన్సీ, హార్డ్‌వేర్, పిండిమరలు, అనుబంధ వ్యాపారాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి.


రోడ్డు పక్కన రెడీమేడ్ వస్త్రాల విక్రయాలు

ఆధ్యాత్మికం

కన్నుల పండువగా కూడారై ఉత్సవం


గంగాళాలతో శరణ్య వేంకటేశ్వర స్వామికి నివేదించిన ప్రసాదం

ఆనందపురం: మండలంలోని గంభీరంలో వెలసిన శ్రీశరణ్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కూడారై ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా 108 వెండి గంగాళాలతో గోదా అమ్మవారిచే స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రసాదాన్ని నివేదించారు. భక్తులకు ఏడు రకాల ప్రసాదాన్ని ఆలయ ధర్మకర్త పైడా కృష్ణప్రసాద్ అందజేశారు.

శ్రీవారికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం శ్రీవారికి కుడారై ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు పురాణం శేషాచార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, వి.తాతాజీ పాల్గొన్నారు. కృష్ణా కాలనీ కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సంక్షేమ కమిటీ సభ్యులు కె.ముత్యాలరావు, జి.సన్యాసిరావు పాల్గొన్నారు.


కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

అష్టలక్ష్మి ఆలయంలో వేడుకలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజు నగర్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో బుధవారం కూడారై ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గోదా అమ్మవారికి రంగవల్లిపై 108 పాత్రల్లో ప్రసాదం ఉంచి అర్చన జరిపి భక్తులకు అందజేశారు. భక్తులు విశేష పారాయణ జరిపినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి తెలిపారు. ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.



పీఎం పాలెం ట్రాఫిక్ కొత్త సీఐగా నల్లి సాయి



పీఎం పాలెం: విశాఖ నార్త్ సబ్ డివిజన్ పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన సీఐగా నల్లి సాయి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సీసీఎస్‌లో పని చేస్తూ ఆయన ఇక్కడికి బదిలీపై రాగా.. ఇక్కడ పని చేస్తున్న సీఐ టి.విజయ కుమార్ విశాఖ సిటీ వీఆర్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా కొత్త సీఐ సాయి మాట్లాడుతూ రహదారి భద్రత, పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సంబంధించి ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటానన్నారు. స్థానిక ప్రజలు, నాయకులు, యువకుల సహకారంతో ట్రాఫిక్ పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

నేటి నుంచి యువజనోత్సవాలు

మహారాణిపేట: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 26వ జాతీయ యువజనోత్సవాలు గురువారం నుంచి ఈనెల 16 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని హుబ్లీ–ధార్వాడ్‌లో గురువారం సాయంత్రం 4 గంటలకు జాతీయ యువజనోత్సవాలు–2023ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్టు సెట్విస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి పి.నాగేశ్వరరావు తెలిపారు.

క్లీన్ విశాఖే ధ్యేయం


బెలూన్లు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్

ఆరిలోవ: విశాఖను పరిశుభ్రంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకట్టుకునే విధంగా మలిచేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా ఉండాలని నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. ఆకాష్ బైజూస్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెంలో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ బెలూన్లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరులు సామాజిక బాధ్యతతో మెలిగి విశాఖను స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు. బీచ్‌తో పాటు అన్నిచోట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు, విద్యా సంస్థల సిబ్బంది కలిసి జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు దిగువన బీచ్ క్లీనింగ్ చేశారు. పాలిథిన్ కవర్లు, కాగితాలు, పిచ్చి మొక్కలు, పేపర్ ప్లేట్లు, సేకరించి బయటికి తరలించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల రీజనల్ డైరెక్టర్ ధీరజ్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడి సన్నిధిలో విశేష సేవలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 700 మంది భక్తులతో సామూహిక విష్ణు సహస్ర పారాయణం, 100 మంది శ్రీవారి భక్తులతో కోలాటం, తిరుప్పావై సేవ నిర్వహించారు. వేంకటేశ్వరుడి జీవిత చరిత్రను చాటి చెప్పే నృత్యం ప్రదర్శించాచారు. నిర్వాహకులు హరిలక్ష్మి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.


నృత్యం ద్వారా వేంకటేశ్వర స్వామి జీవిత చరిత్రను తెలియజేస్తున్న కళాకారులు

కేపీఎల్ క్రికెట్ లీగ్ ప్రారంభం


చిట్టివలసలో క్రికెట్ లీగ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో బుధవారం కేపీఎల్ క్రికెట్ లీగ్‌ను వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఒకటో వార్డు నాయకులు పందిరి విజయ్, అక్కరమాని చినబాబు తదితరులు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ లీగ్‌లో ఐదు జట్లు పాల్గొనగా.. ఒక్కో జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు దళాయి శివ, నిర్వాహకులు సునీల్, చిట్టి, జీవా, మురళి తదితరులు పాల్గొన్నారు.